## క్లుప్తంగా

### అనుమతి లేని నిర్మాణాల తొలగింపు



నిర్మాణాలు తొలగిస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలో అనుమతికి విరుద్ధంగా, అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు మంగళవారం జేసీబీతో తొలగించారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో, 22వ వార్డులో రోడ్డుపై నిర్మించిన ర్యాంప్, సాయిబాబా ఆలయ వెనకనున్న ఆదీ రస్తాలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను, జవహర్ రోడ్‌లో సెట్ బ్యాక్ లేని నిర్మాణాన్ని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, ఎన్ఫోర్స్‌మెంట్ టీం సభ్యులు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు



అటవీప్రాంతంలో చదును చేసిన భూమి

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లోని అటవీభూమిని,ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని అధికారులు స్పందించి తక్షణమే వారిపై చర్యలు తీసుకోకుని భూములను కాపాడాలని గ్రామానికి చెందిన దమ్మ నర్సింగం మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. చిన్నాపూర్ గ్రామశివారులోని సర్వే నెంబర్ 99,100 లలోని అటవీభూములను కొందరు వ్యక్తులు చదును చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇంటర్ విద్యార్థులు పరీక్షలు నిర్భయంగా రాయాలి



పరీక్షల టైంటేబుల్ ఆవిష్కరిస్తున్న నారాయణ

కథలాపూర్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు నిర్భయంగా రాయాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ అన్నారు. కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల 16 ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షకు విద్యార్థులందరూ హాజరుకావాలన్నారు. ఇంటర్ పరీక్షల టైం టేబుల్ కార్డులను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్ ఉన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై అనిల్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతలను కాపాడుతానని, యువత గంజాయికి అలవాటు పడవద్దని, గంజాయి అక్రమ రవాణాను అరికడుతానని అన్నారు. ఎవరైన గ్రామాల్లో గంజాయి సరఫరా చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ఎస్సైని మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, నాయకులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

పెగడపల్లి:మండల తహసీల్దార్‌గా ఆర్ శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎంఏ ఫరూక్ రెండు రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఎనిమిది దాటితే బస్సులేదు

- నైట్‌హాల్ట్ బస్సు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు
- బస్సు నడిపించాలని వేడుకోలు



రాయికల్: ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నా టీఎస్ఆర్టీసీ అధికారులు గొప్పగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. మండలంలోని పలు చోట్లకు, రాయికల్ పట్టణానికి రాత్రి ఎనిమిది గంటలు దాటితే బస్సు సౌకర్యం లేదు. దీంతో రాత్రి పూట ప్రయానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి ఎనిమిది గంటలు దాటితే జగిత్యాల నుంచి రాయికల్‌కు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. గతంలో కొత్తపేటకు వరకు నడిచే నైట్‌హాల్ట్ బస్సు రద్దు చేయడంతో రాత్రుల పూట వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాయికల్ పట్టణంతో పాటు, రాయికల్ నుంచి నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాలకు బోర్నపల్లి బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగడంతో వర్తక వ్యాపారాలు, వాణిజ్యాలు మెరుగుపడ్డాయి. కానీ జగిత్యాల జిల్లా కేంద్రానికి రాత్రి పూట బస్సు ద్వారా ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొత్తపేట గ్రామానికి రాత్రి 9 గంటల తర్వాత వచ్చేది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పనులు ముగించుకుని ఆ బస్సుకు నిరుద్యోగులు, చిరు వ్యాపారస్తులు నైట్‌హాల్ బస్సుల్లో తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు. ఆరునెలలుగా కొత్తపేట బస్సును రద్దు చేయడంతో పాటు, జగిత్యాల డిపోకు చెందిన బస్సులు రాత్రి ఎనిమిది గంటలు దాటితే లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలకు అధిక డబ్బులు చెల్లించి తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి రాయికల్ పట్టణానికి రాత్రి పూట బస్సు నడిపేలా, కొత్తపేట నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

### బస్సు పునరుద్ధరించాలి



రాయికల్ మండలం కొత్తపేట గ్రామానికి, రాయికల్ పట్టణానికి రాత్రి పూట వచ్చే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి. రాత్రి ఎనిమిది గంటల తర్వాత బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించాలని కోరుతున్నాం. – మీనుగు అంజయ్య, మాజీ సర్పంచ్, కొత్తపేట

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నాం. రాత్రి ఎనిమిది గంటల తర్వాత బస్సును రాయికల్ పట్టణానికి నడిపించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి రాగానే ప్రయాణికులకు బస్సు సౌకర్యం కల్పిస్తాం. – సునీత, డిపో మేనేజర్, జగిత్యాల

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం/ధర్మపురి: మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ఏఎస్సై రాజమల్లయ్య కుటుంబానికి పోలీసు భద్రత పథకం కింద మంజూరైన రూ.7,63,040 చెక్కును మంగళవారం ఆయన భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ పూర్తిగా భరోసా కల్పిస్తుందన్నారు. ఏవో అమర్‌నాథ్, సూపరింటెండెంట్ నయీం పాల్గొన్నారు.

## రాజకీయ ఎదుగుదలకు న్యాయవాద వృత్తి తోడ్పాటు

జగిత్యాలరూరల్: రాజకీయంగా ఎదిగేందుకు తనకు న్యాయవాద వృత్తి తోడ్పడిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోర్టు రెండో అంతస్తు భవన నిర్మాణం కోసం న్యాయవాదులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు ఆవరణలో మౌలిక వసతులు కల్పించడం నా బాధ్యతగా తీసుకుంటానన్నారు. కోర్టు భవనంలో రెండో అంతస్తు నిర్మించేందుకు నిధులు కేటాయించడంతో పాటు, ఏడాది లోపు భవనం పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. శిథిలావస్థకు చేరిన రెవెన్యూ భవన స్థలాన్ని కోర్టుకు అప్పగిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని న్యాయవాదులు విజ్ఞప్తి చేయగా సీఎం దృష్టికి తీసుకెళ్లగా కోర్టుకు రెవెన్యూ స్థలాన్ని కేటాయించేలా చొరవ చూపుతానన్నారు.

## సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న ధర్మజాగరణ సమితి సభ్యులు

రాయికల్: మండలంలోని బంజార బస్తీ గాంధీ తండా, భోజ్యానాయక్ తండాలో మంగళవారం ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ బంజారులు, హిందూ ధర్మం కోసం చేసిన ఉద్యమాల గురించి గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ధర్మజాగరణ కార్యకర్త తిరుకోవెల సురేందర్, నాయకులు తిరుమల్, చిరంజీవి పాల్గొన్నారు.

**సరోజినినాయుడు జయంతి వేడుకలు**

మెట్‌పల్లి: కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలు దివంగత సరోజిని నాయుడు జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలో స్థానిక మహిళా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు అందె భవితారాణి, అందె మారుతి, రాజు, అక్షర, సరిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు న్యాయ సహాయం అందిస్తాం

జగిత్యాలరూరల్: నిరుపేదలకు న్యాయపరమైన సమస్యల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని హైకోర్టు న్యాయమూర్తి మురళీధర్ అన్నారు. మంగళవారం జగిత్యాలలో ఉచిత న్యాయ సహాయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో నిరుపేదల పక్షాన నిలిచేందుకు న్యాయపరమైన సమస్యలున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం జగిత్యాలకు చెందిన ఏటీఎం స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చంద్రశేఖర్‌గౌడ్ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మానస, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు సాయిరాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్**

జగిత్యాలరూరల్: మండలంలోని జాబితాపూర్ మాజీ సర్పంచ్, ప్రస్తుత సింగిల్ విండో డైరెక్టర్ నీలం లక్ష్మీనర్సయ్య మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**పోపా పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక**

మెట్‌పల్లి: పద్మశాలీ అఫిసీయల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగరి మధుసూదన్, గౌరవ అధ్యక్షుడిగా గుండేటి రాజారత్నాకర్, ప్రధాన కార్యదర్శిగా గాజంగి నాగరాజు, ఉపాధ్యక్షులుగా పోతు లక్ష్మణ్, మ్యాన శ్రీనివాస్, మామిడాల లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు.

**వెంకన్నస్వామి కల్యాణోత్సవానికి ఆహ్వానం**

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామ శివారులోని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి హాజరు కావాలని నిజామాబాద్ ఎంపీ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌కు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు.

**విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి**

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన పొన్నం లచ్చయ్యకు చెందిన గేదెను విద్యుత్ స్తంభానికి కట్టేశాడు. ప్రమాదవశాత్తు స్తంభం సపోర్టు తీగ తెగి గేదె మీద పడటంతో షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమరు రూ. 50 వేల విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

**16న గ్రామీణ భారత్ బంద్**

జగిత్యాలటౌన్: బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16 న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌లో మేము సైతం పాల్గొంటామని గిడ్డంగుల సంస్థ హమాలీ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేశ్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజలు అధిక సంఖ్యలో గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

**వంతెన పనులు ప్రారంభిస్తాం**

సారంగాపూర్: సారంగాపూర్–లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య కూలిపోయిన వంతెన పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై అటవీప్రాంతంలో కూలిపోయిన వంతెనను పరిశీలించారు. రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈ వంతెన ఒక పక్కన కూలిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పనులపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు పరిశీలించి పనులు చేపడతామని పేర్కొన్నారు.

**ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు**

రాయికల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం మండలాలను కేటాయించారు. పెగడపల్లికి శ్రీనివాస్‌రెడ్డి, వెల్గటూర్‌కు రవీందర్‌రెడ్డి, మల్యాలకు ఆవునూరి స్వాతి , కొడిమ్యాలకు స్వరూప, జగిత్యాల అర్బన్‌కు విజయలక్ష్మి, కథలాపూర్ కు శంకర్, ధర్మపురికిరవీందర్, గొల్లపల్లికి రాంరెడ్డి, మల్లాపూర్‌కు రాజేందర్ రెడ్డి, బుగ్గారం మండలానికి శ్రీనివాస్, జగిత్యాల రూరల్‌కు రమాదేవి, బీర్‌పూర్‌కు లచ్చాలు, రాయికల్‌కు చిరంజీవిని కోరుట్లకు రామకృష్ణకు పోస్టింగ్ ఇచ్చారు.

**సామాజిక అంశాలపై కళాజాత**

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో మంగళవారం జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు, గల్ఫ్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సీసీకెమెరాల అవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ అశోక్, గ్రామస్తులు ఉన్నారు.

### మల్లన్న జాతరలో అగ్ని గుండాలు



కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామ శివారులోని సంఘ మహేశ్వర ఆలయ ఆవరణలో ఉన్న మల్లన్న స్వామి జాతర ఉత్సవాల ముగింపు మంగళ వారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తడి గుడ్డలతో అగ్ని గుండంలో నడుచుకుంటూ వెళ్లి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో బీఐఎస్‌పై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెల్మెట్, ప్రెజర్ కుక్కర్, వాటర్ బాటిల్ స్టాండర్డ్ పై గ్రూపుల వారీగా పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన 4 గ్రూపులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీఐఎస్ ఎస్‌పీవో అభిసాయి, రిసోర్స్ పర్సన్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

ఇబ్రహీంపట్నం: నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టాలని గ్రామప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్దండిలో పారిశుధ్య పనులను పరిశీలించి, గ్రామ నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను, శ్మశాన వాటికను పరిశీలించారు. నర్సరీలో మొలకెత్తని విత్తనాల చోట మళ్లీ నాటి హరితహారానికి సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారొబార్ రత్నం పాల్గొన్నారు.

## మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా మోహన్

మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా మోహన్‌ను నియమించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌లో మేనేజర్‌గా ఉన్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఈయన గతంలో ఇక్కడ కూడా మేనేజర్‌గా పని చేశారు.

## అయోధ్యకు తరలిన రామభక్తులు



రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: అయోధ్యలోని బాల రాముని దర్శనానికి కోరుట్ల నియోజకవర్గ బీజేపీ శ్రేణులు మంగళవారం నిజామాబాద్ నుంచి ప్రత్యేక రైలులో అయోధ్య తరలివెళ్లారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో భారీగా అయోధ్యకు బయలుదేరారు. అయోధ్య వెళ్లిన వారిలో కౌన్సిలర్ మాడవేణి నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: అయోధ్యలోని రామమందిరం దర్శనానికి రాయికల్ పట్టణం, మండలం నుంచి వెళ్తున్న రామభక్తులు, బీజేపీ కార్యకర్తలకు మంగళవారం రాయికల్ పట్టణంలో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు కుంబోజి రవి, సతీశ్, గంగాధర్, నరేశ్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: జగిత్యాల ధరూర్ క్యాంప్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పెల్ విజార్డ్ డ్రామా కాంపిటీషన్ నిర్వహించారు. దీనిలో డ్రామా స్ట్రీమ్–1 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ రామన్నపేట విద్యార్థులు, స్ట్రీమ్–2 విభాగంలో రాయికల్ విద్యార్థులు ఎంపిక కాగా, స్పెల్ విజార్డ్ విభాగంలో స్ట్రీమ్ –1 జెడ్పీహెచ్ఎస్ కొత్తపేట విద్యార్థులు, స్ట్రీమ్–2 విభాగంలో కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రాజశేఖర్, పాటిల్ ధరమ్‌దీప్, పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ బాసిత్, నరేందర్‌రావు, శరత్‌బాబు, ప్రేమలత, శ్రీనివాస్, మురళీకృష్ణ, రాజేందర్, హరినాథ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన కవిత్వం పోటీల్లో మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి పి.ధనిక్ నీరు–పొదుపు అనే అంశంపై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జగన్మోహన్ తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థికి గైడ్లుగా సైన్స్ టీచర్లు తిరుపతిచారి,వనిత వ్యహరించారని తెలిపారు. ధనిక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

మెట్‌పల్లి: గుజరాత్‌లోని అహ్మద్‌బాద్‌లో ఈ నెల 16 నుంచి జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని నిఖిల్ భరత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్‌కే అఫన్, కె సుమీత్ ఎంపికయ్యారు. వీరిని మంగళవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో కరస్పాండెంట్ మహర్షి సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జేఈఈ మెయిన్స్‌లో గోవిందుపల్లి విద్యార్థి ప్రతిభ**

జగిత్యాలరూరల్: పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండ శ్రీనివాస్ జయశ్రీల కుమారుడు గుండ జ్ఞానేశ్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.96 శాతం సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు.

కోరుట్ల: పట్టణంలోని మాస్టో జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో ప్రతిభ చాటారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో అలిశెట్టి శ్రీనిధి 83.79 శాతం, అచ్చ భువనకృతి 77.01 శాతం సాధించి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

## జిల్లా స్థాయి పోటీల్లో మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

గొల్లపల్లి: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్ట్రీమ్ టూ స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో గొల్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. ఇందులో భాగంగా స్పెల్ విజార్డ్‌లో ఎ.వర్షిణి గెలుపొందగా, డ్రామా పోటీలో ఎస్.సేజల్, అనిశ్విక్, సాయి సమృద్, సుప్రీత్, నేహశ్రీ బృందం గెలుపొందింది. ఈ సందర్భంగా ఎల్టా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ధరందీప్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.నగేశ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## ఇటిక్యాల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్:మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అంకతి చరణ్య, రాంచరణ్, బేతి రష్మిత, చెట్‌పల్లి సిందూజ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) అవార్డులకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సదాశివ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాజంగి రాజేశం, ముక్కెర శేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, ఎద్దండి రమేశ్, శాంతకుమారి, జియోద్దీన్, హన్మంతరావు, సంపత్ పాల్గొన్నారు.

**ఇంగ్లిష్ స్పెల్ బీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

పెగడపల్లి: ఇంగ్లిష్ స్పెషల్ బీ కాంపిటేషన్లో పెగడపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాలో ధరూర్ క్యాంపు హైస్కూల్లో మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజి అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో స్పెల్ బీ, డ్రామా కాంపిటేషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. దీనిలో ఎం నవ్య ద్వితీయ స్థానం, డ్రామా పోటీలో మదర్స్ లవ్ డ్రామా ప్రదర్శనకు పెగడపల్లి మోడల్ స్కూల్‌కు రెండో స్థానం లభించింది. కార్యక్రమంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి దామోదర్‌రెడ్డి

మల్లాపూర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచి ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి కే.దామోదర్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రాథమికస్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు నూతన విధానాలతో శిక్షలిస్తూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తొలిమెట్లు, మోడల్ లెస్సన్స్, మధ్యాహ్న భోజన నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల 100శాతం హాజరు, సామర్థ్యాల సాధన, మైక్రో టీచింగ్, ఏబీసీ అమలుపై మూలాల్లోకి వెళ్లాలని, 3 ఆర్స్ నేర్పించుటకు ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న టీచర్లు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం ముందస్తుగా వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వసంత పంచమికి సరస్వతీ ఆలయం ముస్తాబు**

మల్యాల: వసంత పంచమి వేడుకలకు మండలంలోని నూకపల్లి శివారులోని శ్రీ సరస్వతీ ఆలయాన్ని ముస్తాబైంది. చేశారు. సామూహిక అక్షరభ్యాసాలు, సామూహిక కుంకుమ పూజలతోపాటు, హోమం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ బండారి కమలాకర్ తెలిపారు. సరస్వతీ ఆలయంలో నిర్వహించే వసంత పంచమి వేడుకలకు తరలిరావాలని ఆయన కోరారు.